అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 17 జూన్ 2023

ఆర్జీయూకేటీ డైరెక్టర్ పదవీ కాలం పొడిగింపు

నవతెలంగాణ-బాసర

బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీ డైరెక్టర్ పదవి కాలాన్ని పొడిగిస్తూ ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ గురువారం ఉత్తర్వులు జారీ చేసినట్లు యూనివర్సిటీ అధికారులు పేర్కొన్నారు. గురువారంతో యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్ కుమార్ పదవీకాలం ముగియడంతో మరో సంవత్సరం కాలం పాటు పొడిగించినట్లు తెలుస్తోంది.

విద్యార్థినికి ఉద్యోగుల ఆర్థికసాయం

ప్రమాదవశాత్తు మృతి చెందిన లిఖిత కుటుంబ సభ్యులకు ఉద్యోగుల సంఘం తరపున రూ.50వేల నగదును అందజేయనున్నట్లు యూనివర్సిటీ పిఆర్ఓ విజయ్ కుమార్ తెలిపారు.

జాన్సన్ నాయక్ యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-దస్తురాబాద్

ఖానాపూర్ బీఆర్ఎస్ నాయకులు భూక్యా జాన్సన్ నాయక్ యువసేన ఆధ్వర్యంలో మండలంలోని రేవోజిపేట గ్రామంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు మైదామ్ శ్రీశైలం రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొమ్మెన గోపి, దాసరి సుధాకర్, మారాజు సత్యం, పిల్లి రమేష్, కిషోర్, నర్సయ్య, సర్వ నర్సయ్య, బబ్లు, సురేందర్ పాల్గొన్నారు.



అర్హులకు ఇండ్ల స్థలాలివ్వాలి



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారు సర్వే నెంబర్ 8లో గల ప్రభుత్వ భూమిలో అర్హులైన పేద కుటుంబాల వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని హవాజ్ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. బావురావుపేట్ శివారులో గల ప్రభుత్వ భూమిని ఇండ్ల స్థలాల కోసం కేటాయించాలని డిమాండ్ చేస్తూ 48 రోజుల నుండి పోరాటం చేస్తున్న పేద కుటుంబాల వారిని శుక్రవారం కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హవాజ్ నాయకులు సాజిత్, జమాలొద్దీన్, జావీద్, మహ్మద్ గౌస్ అలీ మాట్లాడుతూ పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించడంతో పాటు ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.10 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ముస్లిం మైనార్టీ హక్కుల కోసం హవాజ్ నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు మాదిరిగా ముస్లీం మైనార్టీ పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్లు కట్టుకునే భూమి ఉన్న వారికి రూ.10 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటి సభ్యులు బోడంకి చందు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్, చెన్నూర్ పట్టణ కమిటి అధ్యక్షులు ఆవేజ్, కార్యదర్శి చంద్రన్న, అనిల్, హవాజ్ నాయకులు రెహమతుల్లా ఖాన్, గౌస్, రుక్సానా, అస్మాబేగం, రజియా బేగం, రుబీనా, షహీన్ ఫాతిమా, నస్రీమ్ బేగం, ఫాతిమా పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ పర్యటన విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 24న జిల్లాలో జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పర్యటనను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా సమీకృత కలెక్టరేట్ భవనం, జిల్లా పోలీస్ కార్యాలయం, టిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలు ఉన్న సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. బహిరంగ సభ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని మణెమ్మ, సిఐ శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గాధవేని మల్లేష్, మాజీ చైర్మన్ వెంకన్న మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, నాయకులు సలాం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీలగిరి, సుబాబుల్ పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నీలగిరి, సుబాబుల్ తోటల పెంపకంతో రైతులకు ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని వ్యవసాయ అధికారులు కృషిరెడ్డి, ఖాదర్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని బురుగూడ రైతువేదికలో శుక్రవారం ఎస్పీఎం కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీరగిరి సుబాబుల్ తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమానికి వ్యవసాయ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఒక్కసారి మొక్కలను నాటడంతో మూడు సంవత్సరాలకు ఒక్కసారి కటింగ్ చేసుకోవచ్చన్నారు. దీంతో రైతులకు ఒక ఎకరం పొలంలో మూడు సంవత్సరాలకు లక్ష యాభై వేల ఆదాయం పొందవచ్చన్నారు. ఈ తోటల ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చని అన్నారు. ఈ తోటలలో రైతులు అంతర పంటలు వేసుకోవచ్చన్నారు. ఎస్పీఎం కంపనీ నర్సరీ నుండి రైతులకు రాయితీ పై మొక్కలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఇనాం, కంపనీ ప్రతినిధులు వార్ల కోటేష్, శ్రీధర్, సంతోష్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా జరగాలి

నవతెలంగాణ-కడెం

జిల్లాలో జరగబోయే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో నిబంధనల ప్రకారం చేయాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజేష్ నాయక్ జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. గతంలో అవసరం లేని చోట మారుమూల ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రాలకు ఉపాధ్యాయులను పంపించడంతో తోటి మారుమూల పాఠశాలలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎక్కడైతే సబ్జెక్టు టీచర్ అవసరం ఉందో అక్కడే సర్దుబాటు చేయాలని, ముఖ్యంగా నిబంధనల ప్రకారం కాంప్లెక్స్ లెవెల్, మండల పరిధిలోనే మొదటగా సర్దుబాటు చేసి తర్వాత సబ్జెక్టు టీచర్, హైస్కూల్ టీచర్లను సర్దుబాటు చేయాలని తెలిపారు.

గిరిజన విద్యాభివృద్ధికి నిరంతరం కృషి

- ఈ ఏడాది ఆశ్రమ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు
- ఒకటి, రెండు తరగతులకు హ్యాపీ లర్నింగ్ ప్రోగ్రాం
- దిశ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కోసం నిధులు
- నవతెలంగాణతో ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఐటీడీఏ ద్వారా గిరిజన విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఉప సంచాలకుడు ఎం.దిలీప్‌కుమార్ అన్నారు. ఈ ఏడాది ఐటీడీఏ పరిధిలోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. పిల్లలకు పాఠ్యాంశాల బోధనను దృశ్య రూపంలోనూ చూపించేందుకు అవకాశం ఉంటుందని తద్వారా పాఠం సులువుగా అర్థమవుతుందని పేర్కొన్నారు. టీడబ్ల్యూపీఎస్ పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులకు ఈ ఏడాది హ్యాపీ లర్నింగ్ ప్రోగ్రాం అమలు చేస్తున్నామని ఇందుకు సంబంధించి హ్యాండ్‌బుక్‌ల రూపకల్పన..ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయిందని వివరించారు. దిశ పాఠశాలల్లో మౌళిక వసతుల కోసం ప్రభుత్వం రూ.4లక్షల చొప్పున మంజూరుచేసిందని వీటితో వివిధ రకాల సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని ఐటీడీఏ పాఠశాలల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై ఆయన నవతెలంగాణతో మాట్లాడారు.

నవతెలంగాణ - ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డీడీ- గిరిజన విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాం. గిరి విద్యార్థులు చదువులో రాణించేలా వివిధ రకాల ప్రణాళికలు, కోర్సులు అమలు చేస్తున్నాం. 6 నుంచి 8వ తరగతి వరకు 28 బాలికల పాఠశాలల్లో వేదిక్ మ్యాథ్స్, లైఫ్ స్కిల్స్, కుట్లు, అల్లికలు వంటి కోర్సులు ప్రవేశపెడుతున్నాం. వేదిక్ మ్యాథ్స్ ద్వారా విద్యార్థులకు గణితం అంటే భయం పారద్రోలడంతో పాటు సులువుగా రాణించేలా చేస్తున్నాం. ఇప్పటికే ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు తర్ఫీదునిచ్చాం. మరోపక్క ఈ ఏడాది తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల తరగతులు ప్రారంభిస్తున్నాం. వచ్చే ఏడాది పదో తరగతిలోనూ అమలు చేస్తాం. ఇప్పటికే అజీమ్ ప్రేమ్‌జీ సంస్థ ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తిచేశాం.

నవతెలంగాణ- ట్రైబల్ వెల్ఫేర్ ప్రైమరీ పాఠశాలల్లో నూతన ప్రవేశాలు..పిల్లల గైర్హాజరును తగ్గించేలా ఎలాంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు..?



డీడీ - డీబ్ల్యూపీఎస్‌ల్లో ఒకటి, రెండు తరగతుల విద్యార్థుల కోసం ఈ ఏడాది హ్యాపీ లర్నింగ్ కార్యక్రమం చేపడుతున్నాం. ఈ విధానంలో ఆటపాటల ద్వారా బోధన చేపడుతారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ కూడా పూర్తిచేశాం. దీంతో చిన్నారుల్లో ఉల్లాసం కలుగుతుంది. తద్వారా బడికి గైర్హాజరు కాకుండా ఉండటంతో పాటు కొత్తగా వచ్చే వారు కూడా ఉత్సాహంగా వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. ఐటీడీఏ ద్వారా ప్రత్యేకంగా హ్యాండ్ బుక్‌లు రూపొందించాం. ఉపాధ్యాయులు ఏ రోజు ఏ పాఠం బోధించాలో ముందుగానే కార్యాచరణ ఉంటుంది. జులై మొదటి వారం నుంచి అమలు చేస్తున్నాం.

నవతెలంగాణ- జిల్లాలో ఇది వరకు ఏర్పాటుచేసిన దిశ పాఠశాలల పరిస్థితి ఏమిటీ..వాటి అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డీడీ - గిరిజన విద్యాభివృద్ధిలో భాగంగా దిశ మోడల్ స్కూల్‌లను ఏర్పాటుచేశాం. ఐటీడీఏ పరిధిలో 118 పాఠశాలలను ఎంపిక చేసి ఇందులో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. తాజాగా ప్రభుత్వం వీటిలో మౌళిక వసతుల కల్పన కోసం ఒక్కో పాఠశాలకు రూ.4లక్షల చొప్పున మంజూరుచేసింది. ఈ నిధులతో ఆట పరికరాలు, కాంపౌండ్‌వాల్, వివిధ రకాల బొమ్మలతో కూడిన పెయింటింగ్ తదితర సౌకర్యాలను కల్పించి ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటుచేస్తున్నాం. ప్రస్తుతం అన్ని పాఠశాలలు సక్సెస్‌గా కొనసాగుతున్నాయి.

నవతెలంగాణ- గిరి విద్యార్థులకు సాంకేతిక విద్యను ఎప్పటి వరకు అందుబాటులోకి తీసుకొస్తారు..?

డీడీ- ఈ ఏడాది జిల్లాలోని 113 ఆశ్రమ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటుచేస్తున్నాం. విద్యార్థులకు డిజిటల్ విద్యనందించేందుకు ఇప్పటికే పాఠశాలలకు అందుబాటులోకి వచ్చాయి. చాలా మంది పిల్లలకు కంప్యూటర్ అంటేనే తెలియని పరిస్థితి ఉంది. కంప్యూటర్లు సమకూర్చడం ద్వారా పిల్లలు ఉత్సాహంగా నేర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. పాఠ్యాంశాలను దృశ్యరూపంలో చూపించడం ద్వారా మరింత సులువుగా అర్థమయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వర్డ్, ఎక్సెల్ వివిధ రకాల స్కిల్స్‌ను నేర్పించేందుకు కార్యాచరణ రూపొందించాం.

నవతెలంగాణ- జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్‌టీల నియామకం ఎప్పటి వరకు చేపడుతారు..?

డీడీ- ఐటీడీఏ పరిధిలో 290మంది సీఆర్‌టీలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించాం. ప్రభుత్వం 150మందిని నియమించేందుకు అవకాశం కల్పించింది. ఆదిలాబాద్ జిల్లాలో 60మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మరో 90మందిని నియమిస్తున్నాం. ఇప్పటికే సుమారు 2వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ నియామక ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుంది.

నవతెలంగాణ- ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?

డీడీ- జిల్లాలోని 113 పాఠశాలల్లో మెనూ పాటించడంపై ఎప్పటికప్పుడు పరిశీలన చేపడుతున్నాం. కానీ ఆయా పాఠశాలలకు భోజన బిల్లులు సుమారు రూ.10కోట్ల వరకు రావాల్సి ఉంది. 13 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం జీసీసీ నుంచి సరుకులు సరఫరా చేసి సర్దుబాటు చేస్తున్నాం. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాము. వారం రోజుల్లో బిల్లులు మంజూరవుతాయని తెలిసింది.

నవతెలంగాణ- ఏటా వర్షాకాలం రాగానే ఆశ్రమ పాఠశాలల్లో తరుచూ ఫుడ్‌పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయి. వీటిని ఎలా నివారిస్తారు..?

డీడీ- ఆయా పాఠశాలల్లో ఉన్న శుద్ధనీటి ప్లాంట్లు(ఆర్‌ఓ) మరమ్మతులు చేయిస్తున్నాం. అవసరమైన చోట కొత్తవాటిని సమకూరుస్తున్నాం. ముఖ్యంగా కొందరు విద్యార్థులు రక్తహీనత, అస్తమా వంటి సమస్యలతో బాధపడుతున్నారు. వర్షాకాలంలో ఈ సమస్య ఎక్కువవుతోందని తెలిసింది.ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా ఇప్పటికే రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తిస్తున్నాం. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కోసం ఇప్పటికే ఏఎన్ఎంలను తిరిగి విధుల్లోకి తీసుకున్నాం. ముఖ్యంగా పాఠశాలల్లో కింది స్థాయి అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ మరింత పెంచుతాం. ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగకుండా ముందస్తుగా నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

నవతెలంగాణ- జిల్లాలోని చాలా పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. నూతన భవనాలు నిర్మాణం ఎప్పటి వరకు చేపడుతారు..?

డీడీ- జిల్లాలో అనేక పాఠశాలలు శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. జిల్లాలో 1213 పాఠశాలల్లో నూతన భవనాలు, తరగతి గదులు, డార్మెటరీ తదితర వాటి నిర్మాణం కోసం ఇది వరకే ప్రభుత్వానికి పంపించాం. ఇది వరకే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తామని చెప్పింది. నిధులు రాగానే ఆయా చోట్ల కొత్త భవనాల నిర్మాణాలు మొదలుపెడుతాం.

మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి దినోత్సవం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణ ప్రగతితో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టి అభివృద్ధి పరిచిందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపాల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి దినోత్సవాన్ని స్థానిక డైట్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. నాడు - నేడు పట్టణంలో జరిగిన అభివృద్ధి, నిధులు, మౌళిక వసతుల కల్పన, పారిశుధ్యం, పచ్చదనంతో గణనీయంగా మెరుగుపడిన తీరు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా పట్టణ ప్రజలకు జరిగిన లబ్ధిని మున్సిపల్ కమిషనర్ శైలజ సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం సాధించిన తర్వాత వివిధ శాఖలలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను 21 రోజుల ఘనంగా నిర్వహిస్తున్నదని, అందులో భాగంగా పట్టణ ప్రగతి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వార్డులో మౌళిక సదుపాయాలు, వసతులు కల్పించేందుకు పట్టణ ప్రగతిలో భాగంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ కింద ప్రతి ఇంటికి నల్ల కనెక్షన్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా 72 వాహనాలతో సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించడం జరుగుతుందని, బంగారిగూడలో 36 ఎకరాలలో కంపోస్ట్ షెడ్ ఏర్పాటు చేశామన్నారు. 7.20 కోట్ల వ్యయంతో సమీకృత వెజ్, నాన్- వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టామని, పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. అలాగే సెంట్రల్ లైటింగ్, జంక్షన్ల అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతకు నిరంతరం పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికుల పని తీరు మరువలేనిదని, పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా కార్మికులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధి కళ్ళ ముందే సజీవ సాక్ష్యంగా ఉందని, పట్టణంలో అంబేద్కర్ చౌక్, తెలంగాణ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్ వంటి పలు ప్రధాన కూడళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అలాగే రహదారుల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, స్వాగత తోరణం, శ్మశాన వాటికలు, డంప్ యార్డ్, పట్టణ ప్రకృతి వనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. జలశక్తిలో దేశంలోనే జిల్లాకు మూడవ స్థానం దక్కడం సంతోషకరమని, ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. మునిసిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి 250 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అందరి సహకారంతో దశల వారిగా పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ప్రశంసాపత్రం, శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర చిత్రపటంగా మానవహారం నిర్వహించి, ర్యాలీగా డైట్ మైదానం నుండి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్ కార్యాలయం పైమున్సిపల్ చైర్మన్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి, జాతీయ గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైస్ మిల్లుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- 248 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని ఆర్ఆర్ఓ కాలనీలో ఉన్న శ్రీనివాస రైస్‌మిల్లుపై శుక్రవారం పౌరసరఫరాల శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. హైదరాబాద్ నుండి వచ్చిన టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డి శ్రీధర్‌రెడ్డి బృందం ఈ మిల్లుపై దాడులు నిర్వహించగా సుమారు 248 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమయ్యాయి. 25కిలోల బస్తాలు 395 ఉండగా, 50 కిలోల బస్తాలు 300 వరకు ఉన్నాయి. మొత్తం 695 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యుటీ తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు టాస్క్‌ఫోర్స్ అధికారులు అప్పగించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస రైస్‌మిల్లులో రేషన్ బియ్యం లభ్యమయ్యాయని, మిల్లుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్ మునావర్ షరీఫ్ మిల్లుకు వచ్చి పట్టుబడ్డ బియ్యం పరిశీలించారు. అనంతరం ఆ బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. ఈ బియ్యం ప్రభుత్వ బియ్యమేనని మిల్లు యాజమాని చిలువేరు సత్యనారాయణ టాస్క్‌ఫోర్స్ అధికారులకు లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చారు. గత రబీ సీజన్‌లో తమ మిల్లునుండి బియ్యం ప్రభుత్వానికి అందించగా అందులో నూక శాతం అధికంగా ఉందనే కారణంతో కొంత మేర బియ్యం తిరస్కరించినట్లు చిలువేరు సత్యనారాయణ విలేకరులకు వివరించారు. మరమ్మత్తుల కారణంగా కొన్ని నెలలుగా తమ మిల్లును కొనసాగించడం లేదని, దీంతో ఆ బియ్యం నిల్వలు అలాగే ఉన్నట్లు తెలిపారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-ఉట్నూర్



ఇంట్లో తల్లిదండ్రులకు తరుచూ గొడవలు జరగడంతో మనస్తాపంతో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలో జరిగింది. కుటుంబ సభ్యులు, ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శ్యాంపూర్ గ్రామానికి చెందిన మక్కల రాములుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెద్ద కుమార్తెకు పెళ్లి జరగగా చిన్న కుమార్తే రవళిక(18) ఇంటి వద్దే ఉంటుంది. తల్లిదండ్రులు తరచు గొడవలు పడుతుండేవారు. గొడవలు జరుగుతున్నాయని మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరేసుకుంది. గతంలో కూడా ఒక సారి ఆత్మహత్యకు యత్నించింది. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టణ ప్రగతితో పురపాలికల అభివృద్ధి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమంతో పురపాలక సంఘాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కాగజ్‌నగర్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి, మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్, కమిషనర్ అంజయ హాజరయ్యారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఛైర్మన్ సద్దాంహుస్సేన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఈ తొమ్మిదేళ్ల కాలంలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందన్నారు. ఇంటింటికీ చెత్తను సేకరించడం, తాగునీరు అందించడం, సేకరించిన చెత్తను శుద్ధి చేసేందుకు 1.34 కోట్లతో శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణాన్ని శుభ్రం చేయడంలో కీలకపాత్ర పోషించే కార్మికులలో ఉత్తములను ఎంపిక చేసి వారికి ప్రశంసాపత్రాలు అందించారు. ఉద్యోగులు, కౌన్సిలర్లకు కూడా ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మందమర్రి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రగతి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుండి రామన్ కాలనీ, ప్రొఫెసర్ జయశంకర్ చౌరస్తా మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, ప్రత్యేక అధికారి కె.నరేందర్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2014 నుండి ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులను అధికారులు వివరించారు. టియుఎఫ్ఐడిసి కొరకు 33.35కోట్లు, మిషన్ భగీరథ 40కోట్లు, అర్బన్ మిషన్ భగీరథ కొరకు 30కోట్లు, డియంఎఫ్టి, సిఎస్ఆర్, పట్టణ ప్రగతి కింద 27.18కోట్లు, సానిటేషన్ హరితహారం పేరుతో 24వార్డులకు 5నర్సరీలు, 9పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసరా పెన్షన్ల కింద నెలకు 6220 మంది లబ్దిదారులకు 135.57లక్షలు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజారోగ్య కార్మికులను కార్యాలయ సిబ్బందిని, ఎస్ఎల్ఎఫ్ఆర్పిలను, బ్యాంకర్లను శాలువాతో ఘనంగా సత్కరించి, మెమొంటో, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, డిప్యూటీ ఇంజనీర్ ఎం సుమతి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వి శ్యాంసుందర్, మేనేజర్ ఏ రాజేందర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ అచ్యుత్, టౌన్‌ప్లానింగ్ సూపర్వైజర్ బి రాజ్‌కుమార్, వార్డు ఆఫీసర్లు భిక్షపతి, మోహన్, రాజన్న, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ గోపికృష్ణ, మెప్మా ఇన్చార్జ్ టౌన్ మిషన్ కోఆర్డినేటర్ ఏ రఘురాం, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు జె రవీందర్, పట్టణ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షులు పైడిమల్ల నర్సింగ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సొతుకు సుదర్శన్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని స్థానిక రాజీవ్‌చౌక్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం రాజీవ్‌చౌక్ నుండి స్థానిక జయశంకర్ విగ్రహం విఠల్‌నగర్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జంగం కళ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.





మందమర్రిలో..

విద్యార్థుల మృతిపై విచారణ చేపట్టాలి

నవతెలంగాణ-ముథోల్

బాసర ట్రిపుల్ ఐటీలో మృతి చెందిన విద్యార్థుల మృతిపై సిట్టింగ్ జడ్జి చే విచారణ జరిపించాలని ముథోల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు విజయ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన అమెరికా నుండి పోన్‌లో ముథోల్ విలేకరులతో మాట్లాడారు. వరుసగా ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు మృతి చెందటం బాధాకరమేనని అన్నారు. విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోకపోవటం తగదని అన్నారు. ట్రిపుల్ ఐటీలో నిఘా వ్యవస్థ పని చేయటం లేదని ఆరోపించారు. ట్రిపుల్ ఐటీలో ప్రతిపక్ష నాయకులు, విద్యార్థి సంఘం నాయకులను మీడియాను అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే పట్టించుకోకపోవటం సరికాదన్నారు. ఇప్పటికైన సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సీఐ సైదారావు సేవలు ప్రశంసనీయం

నవతెలంగాణ-ఉట్నూర్



బదిలీపై వెళ్తున్న ఉట్నూర్ సీఐ సైదారావు సేవలు ప్రసంశనియమని వైస్ ఎంపీపీ ధవులే బాలాజీ, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీరామ్ జాదవ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ధాసండ్ల ప్రభాకర్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ అన్నారు. సీఐ సైదారావు ఆదిలాబాద్ రూరల్‌కు బదిలీ అవ్వడంతో శుక్రవారం స్థానిక సీఐ కార్యాలయంలో సన్మానించారు. ఆయన సేవలను అభినందిస్తూ శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఇలాంటి మన్ననలు సీఐ సైదారావు ఎక్కడ ఉన్న అందరి మన్ననలు పొందాలని అభిప్రాయలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షులు తన్నీరు సతీష్, నాయకులు జగ్జివన్, అంజద్ ఖాన్, రవీందర్, శ్యామ్ ఉన్నారు.

ప్రత్యేక బడ్జెట్‌తో బలోపేతం చేయాలి

- అంగన్‌వాడీలకు పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలి
- అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి



నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్

ఐసీడీఎస్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి బలోపేతం చేయాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పీఆర్‌టీయూ భవనంలో ఏర్పాటుచేసిన తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జీపు జాత కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జీపు జాతను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులకు పిఎఫ్, ఈఎస్ఐ ,ఉద్యోగ భద్రత వంటి సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 ని రద్దు చేయాలని, 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటి చెల్లించాలని రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న సమస్యలన్నింటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం మెడలు వంచెలా కార్మిక ఐక్య ఉద్యమాలను రూపొందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పూరపాటి రమేష్, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కె.సునీత, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ ఆశన్న ,అన్నమొల్ల కిరణ్, రాష్ట్ర నాయకులు సోమన్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు డి .వెంకటమ్మ, నాయకులు డి .సునీత, పి. రత్నమాల, సుభద్ర ,మధునిక, కళ, పంచశీల, పంచ పూల, ఖుషి వర్ధ కళ్యాణి, సంగీత, సిఐటియు జిల్లా నాయకులు పండుగ పొచ్చన్న, ఎం. గంగన్న, చిన్నన్న, రమాకాంత్, రమేష్ పాల్గొన్నారు.







బీఆర్ఎస్ హయాంలో పట్టణాలు అభివృద్ధి

- ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్
- ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం



నవతెలంగాణ-ఖానాపూర్

బీఆర్ఎస్ హయాంలో పట్టణాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. శుక్రవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఖానాపూర్ పట్టణంలో జె.కె ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హజరై మాట్లాడారు. నాడు నేడు పట్టణ ప్రగతి అభివృద్ధి గురించి వివరించారు. పట్టణంలో నివసించే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పట్టణ ప్రగతిని చేపట్టిందని అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో పట్టణ పల్లె రూపురేఖలు మారుతున్నాయని అన్ని రంగాలవారు అభివృద్ధి చెందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పోడు సాగుదారులందరికీ పట్టాలివ్వాలి

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే రాజు డిమాండ్



నవతెలంగాణ-కడెం

అటవీ భూమి సాగుదారులందరికి అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కుపత్రాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నిర్మల్ జిల్లా కార్యదర్శి జె రాజు శుక్రవారం డిమాండ్ చేశారు. కడెం మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్దాలుగా ఆదివాసీ, గిరిజన, ఇతర పేదలు అటవీ భూములను సాగుచేసుకుంటు జీవిస్తున్నారని, హక్కుపత్రాలు లేక ప్రభుత్వ పథకాలు అందక, ప్రకృతి విపత్తులు వచ్చి పంట నష్టపోయినా భరిస్తూ హక్కు పత్రాల కోసం ఎదురుచూస్తుంటే,ప్రభుత్వం మాత్రం మోచేతికి బెల్లం పెడుతుందని అన్నారు. కూర్చివేసుకొని పట్టాలు ఇస్తా అన్న కేసీర్, తన కుర్చీలాటలో సాగుదరులను మర్చిపోయాడని, ఇప్పటికైనా హక్కుపత్రాలు ఇవ్వకుంటే ప్రజా ఆగ్రహానికి ప్రభుత్వం గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. తదనంతరం చంద్రన్న వర్గం నుండి న్యూడెమోక్రసీలో చేరిక ఖానాపూర్, కడెం ఉమ్మడి మండలాల్లో పని చేస్తున్న చంద్రన్న వర్గం నాయకులు, కార్యకర్తలు. మానక, దేవన్న, రాజేశ్వర్, సత్తన్న, మల్లక్క, ఎంకు పటేల్‌లతో పాటు ఇతర కార్యకర్తలు తమ మాతృ సంస్థ అయిన సీపీఐ(ఎం ఎల్) న్యూడెమోక్రసీలో చేరారని తెలిపారు. వీరిని పార్టీ జిల్లా కార్యదర్శి జె రాజు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనలో ప్రజలు ఐక్యంగా పాల్గొనాలని, ప్రజా సమస్యలపై దీర్ఘకాల పోరాటాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.హరిత, కె.సర్దార్, సునారికరి రాజేష్, గోపి నర్సయ్య, వెంకటేష్, భూక్య విలాస్, లింగన్న, ప్రసాద్, స్వామి, గంగన్న పాల్గొన్నారు.

దశాబ్ధి ఉత్సవాలకు కౌన్సిలర్లు దూరం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన తెలంగాణ దశాబ్ధి ఉత్సవాల కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్లు మూకుమ్మడిగా గైర్హాజరయ్యారు. మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ ఖలీల్ మాత్రమే కార్యక్రమంలో పాల్గొన్నారు. కొంతకాలంగా ఎమ్మెల్యే రేఖానాయక్, మున్సిపల్ చైర్మెన్ రాజేందర్‌తో కౌన్సిలర్‌లు దూరంగా ఉంటున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే సదరు కార్యక్రమానికి కౌన్సిలర్లు గైర్హాజరయినట్లు చెబుతున్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లతో పాటు అధికారపార్టీకి చెందిన కౌన్సిలర్లు సైతం హాజరు కాకపోవడం చర్చానీయంశంగా మారింది. కేసీఆర్ హాయంలోనే మున్సిపాలిటీలు అభివృద్ధి : ఎమ్మెల్యే రేఖానాయక్ సీఎం కేసీఆర్ హాయంలోనే మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజగంగన్న, రాముానాయక్, పుప్పాల శంకర్, ఎనగందుల నారాయణ, కిషోర్, సుమన్, రాజు పాల్గొన్నారు.

బాసర ఆలయంలో భక్తుల రద్దీ



నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి నది తీరాన గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు చిన్నారులు అమ్మవారి దర్శన అక్షరాభ్యాస క్యూలైన్‌లలో బారులు తీరారు. అమ్మవారి అక్షరాభ్యాస మండపాలలో భక్తులు తమ చిన్నారులకు ఆలయ అర్చకులచే ప్రత్యేక అక్షరాభ్యాస పూజలు జరిపించి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి అన్నదాన సత్రంలో భక్తులకు ఆలయం తరపున ఉచిత అన్నదాన ప్రసాద వితరణ చేశారు. అక్షరాభ్యాస పూజలు లడ్డు ప్రసాదాల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.10 లక్షల వరకు ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

ఆలయంలో ప్రముఖుల పూజలు..

సరస్వతి దేవి అమ్మవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు ఎమ్మెల్సీ దండే విఠల్, ముథోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్ రావు పటేల్, అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. వీరికి ఆలయం తరపున సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో కమర్షియల్ కాంప్లెక్స్

- శంకుస్థాపన చేసిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై ఆర్టీసీ దృష్టి సారించిందని, ఇందులో భాగంగా నిర్మల్ బస్టాండ్ ఖాళీ స్థలంలో వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్నట్టు మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో రూ.34.43 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన ఆర్టీసీ కమర్షియల్ కాంప్లెక్స్‌కు ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా 1.3 ఎకరాలలో 43 వేల స్క్వేర్ ఫీట్ల విస్తీర్ణంలో అత్యాధునిక హంగులతో మెరుగైన సౌకర్యాలతో కమర్షియల్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నామని అన్నారు. ఈ కమర్షియల్ కాంప్లెక్స్‌లో పార్కింగ్ సదుపాయం కోసం సెల్లార్, జి ప్లస్ త్రీ నిర్మాణంలో 53 స్టాళ్లను, శుభకార్యాలు నిర్వహించేందుకు కూడా ప్రత్యేక హాలును నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం వెయిటింగ్ హాల్స్, ఇతర సౌకర్యాలతో పాటు ఎల్సీడీ తెరలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఏడాదిలోగా నిర్మాణం పూర్తి అయ్యేలా ప్రణాళికలు రూపొందించుకుని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం వారు బస్టాండ్‌లో కలియతిరిగారు. ప్రయాణికులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. తర్వాత నిర్మల్ బస్టండ్ ప్రక్క నుంచి ప్రియదర్శిని నగర్ వేళ్లే రోడ్‌ను పరిశీలించారు. ఇరుకైన రహదారితో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని 40 ఫీట్ల సీసీ రోడ్ విస్తరణకు ప్రణాళికలను రూపొందించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కొలాం గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్



నవతెలంగాణ-ఉట్నూర్

అదిమ తెగ కొలాం గిరిజనుల సమస్యల పరిష్కరించాలని, టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. టీఏజీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు ఆత్రం భగవంత్‌రావు 3వ వర్ధంతి సభను శుక్రవారం మండలంలో కామయిపేట్ గ్రామంలో నిర్వహించారు. భగవంతరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన వ్యక్తని అన్నారు. సామాన్య కార్యకర్త నుండి జిల్లా అధ్యక్షులు వరకు ఎదిగి ఎన్నో గ్రామాల సమస్యల పరిష్కారం కోసం కడ వరకు నిలబడిన గొప్ప నాయకుడని అన్నారు. కొలాం, ఆదివాసీల సంస్కృతి పరిరక్షణ, బాషా పరిరక్షణ కోసం టీఏజీఎస్‌గా ఆదివాసీల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదిమా కొలాం తెగల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయ్యాయని, పీవీజీటీ తెగల అభివృద్ధి కేవలం కాగితలకే పరిమితం చేశారని, అనేక గ్రామాలకు కనీస మౌలిక సదుపాయాలు లేక సమస్యలతో సతమాతమవుతుయని దీని వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు గడుస్తున్న నేటికి ఆదివాసీ గిరిజన గ్రామాలకు కనీస సౌకర్యాలు అందని ద్రాక్షగా మారిందని అన్నారు. కొలాం ఆదివాసీల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, మండల అధ్యక్షులు కనక మల్కు, కార్యదర్శి నాగోరావ్, టీఏవీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం తనుష్, గ్రామ పటేల్ చాహకటి రాజేశ్వర్, గ్రామస్తులు ఉన్నారు.

ఆన్‌లైన్ పద్ధతిని వెనక్కి తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్



బీసీ కళాశాలల వసతి గృహాలకు ఆన్‌లైన్ పద్ధతిలో ప్రవేశాలు కల్పించే పద్ధతిని వెనక్కి తీసుకోవాలని, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్ అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ విద్యాసంవత్సరం నుంచి బీసీ కళాశాల వసతి గృహాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్ పద్ధతిలో ఆప్లై చేసుకోవాలని బీసీ శాఖ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక విద్యార్థి ఆన్‌లైన్‌లో హస్టల్స్ సీటు కోసం దరఖాస్తు చేసుకొన్న తర్వాత విద్యార్థి 03 హస్టల్స్ ఆప్షన్లు ఇవ్వాలని ఎక్కడ సీటు వస్తే అక్కడ చేరాలని నిబంధన పెట్టారని అన్నారు. దీని వల్ల హస్టల్స్ చేరే పరిస్థితి ఉండదని అన్నారు. కేవలం 03 హస్టల్స్ ఎంచుకోవడానికి విద్యా కేంద్రాలలో మాత్రమే ఉన్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో ఇవి లేవని విద్యార్థులు చేరే అవకాశం లేదని అన్నారు. ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు చేయడం అంటే హస్టల్స్ ఎత్తివేయాలని కుట్ర చేయడమని విమర్శించారు. కళాశాలలో అడ్మిషన్ తీసుకున్న ప్రతి విద్యార్థికి హస్టల్ సీటు కల్పించాలని, ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోందన్నారు. బీసీ విద్యాశాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అద్దె భవనాల్లో నడుస్తున్న హస్టల్స్, సౌకర్యాలు లేని హస్టల్స్ నాణ్యమైన భోజనం అందించకుండా హస్టల్స్ ఎత్తివేసే కుట్ర చేస్తుందని అన్నారు. గతంలో లాగానే హస్టల్స్ అడ్మిషన్లు చేయాలని జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నవీన్ జిల్లా నాయకులు పరమేశ్వర్ పాల్గొన్నారు.

యువతకు భరోసా... కాంగ్రెస్ ఎజెండా...

- డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

యువతకు భరోసా కాంగ్రెస్ పార్టీ ఏజెండా అని డీసీసీ అధ్యక్షులు సాజిద్, ఖాన్, ఖానాపూర్ నియోజక వర్గం ఇన్‌చార్జీ ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత సంయుక్తంగా మాట్లాడారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ నాయకత్వంలో అధికారంలో రావడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీని రాబోయే ఎన్నికల్లో గెలుపించాలని కోరారు. రాహుల్ గాంధీ హైదరాబాద్‌లో ఇచ్చిన యూత్ డిక్లరేషన్ ప్రకారం యువతకు రూ.2లక్షల ఉద్యోగాలతో పాటు నిరుద్యోగ భృతి అందిస్తామని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ స్వయం ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రైతులకు ఒకే సారి రూ.2 లక్షల రుణమాఫీ, తెలంగాణ అమరవీరుల కుటుంబానికి ఒక ఉద్యోగంతో పాటు రూ.25 వేల పింఛను అందిస్తామని అన్నారు. పెరిగిన వంట గ్యాస్ సిలెండర్ ధర కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా రూ.500 లకే పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఇందిరా క్రాంతి పథకం ద్వారా మహిళలకు వడ్డీ లేని రుణాలను అందిస్తామని స్పష్టం చేశారు. చదువుకునే విద్యార్థుల కోసం ఆన్‌లైన్ ద్వారా వ్యాసరచన పోటీలను నిర్వహించి, ప్రతిభా కనపర్చిన వారికి బహుమతులను అందజేస్తామని దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏదీ ఏమైనా రాబోయే రోజుల్లో ఖానాపూర్ నియోజక వర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆరంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గుడిపల్లి నగేష్, రాష్ట్ర మహిళా కార్యదర్శి నాయకురాలు సునీత, రాథోడ్ రాధ బాయి, స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



నవతెలంగాణ-బాసర

మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ సునీత విశ్వనాథ్ పటేల్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరయ్యారు. ముందుగా అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ మన ఊరు మన బడిలో భాగంగా చేపట్టిన పనులలో తమకు ప్రాధాన్యత ఇవ్వకుండా చేశారని, అవసరం లేని పనులను తమతో చేయిస్తున్నారని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. కిర్గుల్(కే) గ్రామంలో శిథిలావస్థలో ఉన్న బడికి నిధులు విడుదల చేయాలని, సర్పంచ్ దేవేందర్ కోరారు. కిర్గుల్ (బి) బాసర ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆ పోస్టులను త్వరగా భర్తీ చేయాలని ఎంపీటీసీ ప్రభాకర్, సర్పంచ్ లక్ష్మణ్‌రావు విద్యాధికారికి సూచించారు. పలు గ్రామాలలో మిషన్ భగీరథ పేరిట చేసిన పనులు నాసిరకంగా ఉన్నాయని అన్నారు. కిర్గుల్ (కే), బాసర, లబ్ది గ్రామాలలో పనులు పూర్తి కాలేవని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో వివరించాలని మిషన్ భగీరథ ఏఈని సర్పంచ్‌లు ప్రశ్నించారు. త్వరలో పనులను పూర్తి చేసి నీటిని అందిస్తామని మిషన్ భగీరథ ఏఈ బదులు ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, సమన్వయంతో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అభివృద్ధిని వివరించాలని కోరారు. సమస్యలను అధికారులు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తుందని ఉత్సవాలలో ప్రభుత్వం ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు, పథకాలను అధికారులు ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్ బాబు, బీదరెల్లి పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్‌గౌడ్, తహసీల్దార్ సంతోష్, ఎంఎహో నాగనాథ్, ఎంపీఓ మన్మోహన్ శాస్త్రి, ఎంపీటీసీలు ఉమారాణి, రమేష్, దిగంబర్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లపై అవిశ్వాసం



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ ఆంకం రాజేందర్, వైస్ చైర్మెన్ అబ్దుల్ ఖలీల్‌ల పై శుక్రవారం మున్సిపల్ పాలకవర్గం సభ్యులు నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డికి అవిశ్వాస తీర్మానం లేఖను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్ అభివృద్ధి కుంటుపడుతుందని అందుకే మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నట్లు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ అవిశ్వాస తీర్మానాన్ని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం ఆధ్వర్యంలో కలిసిన ఖానాపూర్ పురపాలక సంఘ సభ్యులు కావాలి సంతోష్, జన్నారపు విజయ లక్ష్మి, పరిమి లత, కిషోర్ నాయక్, కుర్మా శ్రీనివాస్, నాయిని ప్రవంతి, అఫ్రీన్ బేగం, పౌజియ బేగంలు ఉన్నారు.

20న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నార్నూర్

ఈ నెల 20న మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఎంపీడీఓ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికను సోమవారంలోగా కార్యాలయంలో అందజేయాలని అన్నారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 17 జూన్ 2023

భూతగాదాలతో నలుగురి బైండోవర్

నవతెలంగాణ-హాజీపూర్



భూతగాదాలతో నలుగురిని తహసీల్దార్ రాజలింగం ముందు బైండోవర్ చేశారు. గుడిపేట్ గ్రామానికి చెందిన లగిశెట్టి సత్తయ్య, పుష్పలత దంపతులు పెద్దంపేట్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు ముక్కెర శంకరయ్య, నంద భూతగాదాలతో కరిపై ఒకరు దాడులకు పాల్పడడంతో ఇరువురిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. భూసమస్యలుంటే పరిష్కరించుకోవాలని, కానీ దాడులకు పాల్పడొద్దని తహసీల్దార్ వారికి సూచించారు.

బీఎస్పీలో పలువరి చేరిక

నవతెలంగాణ - చింతలమానేపల్లి



మండలంలోని దింద గ్రామానికి చెందిన 30మంది యువకులు బీఎస్పీలో చేరారు. బీఎస్పీ నాయకులు సోయం చిన్నయ్య, బెజ్జూర్ మండల అధ్యక్షులు ఆత్రం సాయి సమక్షంలో బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తామని, రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో బీఎస్పీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అక్రమ అరెస్టులకు ఖండన

నవతెలంగాణ-నస్పూర్

హనుమకొండ జిల్లాలో శనివారం కేటీఆర్ పర్యటన సందర్భంగా ఒకరోజు ముందుగానే ఎస్ఎఫ్ఐ నాయకత్వాన్ని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని, కాకతీయ యూనివర్శిటీలో హాస్టల్స్, మెస్ సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నిస్తున్న నాయకత్వాని అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. యువతి అని కూడా చూడకుండా పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం దుర్మార్గమన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిశ్రీన్ సుల్తాన, జిల్లా నాయకత్వాని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఇంటింటికి ఓటర్ నమోదు కార్యక్రమం

నవతెలంగాణ-జన్నారం

ఈ నెల 17 నుండి 20 వరకు ఇంటింటికి తిరుగుతూ ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ చేయాలని పోలింగ్‌స్టేషన్‌ల బూత్ లెవల్ అధికారులకు తహసీల్దార్ ఇట్యాల కిషన్ సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బిఎల్ఓలకు పలు సూచనలు చేశారు. అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏండ్ల వయసు నిండే ప్రతి వ్యక్తిని ఫారం 6 ద్వారా ఓటర్‌గా నమోదు చేయాలని, అదే విధంగా ప్రస్తుతం ఉన్న ఓటర్ లిస్ట్‌లో చనిపోయిన వారిని శాశ్వతంగా, స్థానంతరం చెందిన వారిని తొలగించడానికి ఫారం 7 ద్వారా తగు చర్య తీసుకోవాలని తెలిపారు. నమోదైన ఓటర్లు వారి ఫోటో, పేరు, అడ్రస్, ట్రాన్స్‌ఫర్ ఉన్నట్లైతే ఫారం 8 ద్వారా సవరణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, ఆర్ఐ భానుచందర్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అధునాతన పరికరం ప్రారంభం

నవ తెలంగాణ - మందమర్రి

మందమర్రి ఏరియాలోని కెకె డిస్పెన్సరీలో రోబో నిక్ సెమి ఆటో అనలైజర్ పరికరాన్ని శుక్రవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ యంత్రం వలన ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, పోస్ట్ లంచ్ బ్లడ్ షుగర్, రాండమ్ బ్లడ్ షుగర్, రీనల్ ఫంక్షన్ టెస్ట్ (కిడ్నీ ఫంక్షన్ టెస్ట్), లుపిడ్ ప్రొఫైల్ (కొలెస్ట్రాల్ టెస్ట్) మొదలైన పరీక్షల్ని అతి తక్కువ సమయంలో చేయవచ్చని తెలిపారు. సింగరేణి ఉద్యోగస్తుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సుమారు 1.8 లక్షల రూపాయలతో ఈ పరికరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని, ఈ సేవలు ఉద్యోగస్తులందరూ వినియోగించుకోవాలని జీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం రాజేశ్వర్‌రెడ్డి, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏఐటియుసి నాయకులు సుదర్శన్, డివైసీఎంవో ఉష, మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వగ్రామంలో ఎంపీ వెంకటేష్ నేత జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జన్నారం

పెద్దపెల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత జన్మదిన వేడుకలను స్వగ్రామం తిమ్మాపూర్‌లో నిర్వహించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు జాడి గంగాధర్ ఆధ్వర్యంలో ఎంపీ తల్లి లింగవ్వ చేతుల మీదుగా కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం పక్కనే ఉన్న హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని యువతీ యువకులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. వార్డు సభ్యులు చిందమ్ చంద్రయ్య, జాడి వెంకట్, రాజన్న, లచ్చన్న, వెంకటస్వామి, లక్ష్మణ్, మల్లేష్ ప్రదీప్, రవి పాల్గొన్నారు.

మండల కేంద్రంలో..

ఎంపీ వెంకటేష్ నేత జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో టిఎన్ఎంవిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు, అనాథలకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

కులవృత్తుల లోన్ దరఖాస్తుల తేదీని పొడిగించాలి

నవతెలంగాణ - రెబ్బెన

కులవృత్తులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష రుణం లోన్ కోసం దరఖాస్తు చేసుకొనే తేదీ ఈ నెల 20న ముగుస్తున్నందున మరో 10 రోజులు పొడిగించాలని సీపీఐ జిల్లా నాయకులు రాయిల్ల నర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గోలేటిలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ దరఖాస్తుకు కేవలం 10 రోజులే అవకాశం ఉండడంతో చాలామందికి ఇంకా కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందలేదన్నారు. రాష్ట్రంలో సగం కులవృత్తులు లోన్‌కు దరఖాస్తు చేసుకోలేదని, ప్రభుత్వం గమనించి మరో 10 రోజులు పొడిగించాలని కోరారు.

సీఎస్, డీఓల తొలగింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులను తొలగిస్తూ ఇంటర్ బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పరీక్ష కేంద్రంలో గురువారం ఇంటర్ ప్రథమ పరీక్షకు 13 మంది విద్యార్థులు చీటీలతో హాజరు కావడం, ఇంటర్ బోర్డు సభ్యులకు దొరకడంతో వారిని అధికారులు డిబార్ చేసిన విషయం తెల్సిందే. దీనికి బాధ్యతగా పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులను కూడా తొలగిస్తూ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరి స్థానంలో రెబ్బెన జూనియర్ కళాశాల లెక్చరర్ ప్రకాష్‌ను చీఫ్ సూపరింటెండెంట్‌గా, కౌటాల లెక్చరర్ బాలకిషన్‌రావును డిపార్ట్‌మెంటల్ అధికారిగా నియమించినట్లు డీఐఈఓ శ్రీధర్‌సుమన్ తెలిపారు.

కార్మిక సమస్యలు గాలికి వదిలేసిన టీబీజీకేయస్

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో కార్మికులకు ఇన్సెంటివ్, అదనపు పనికి ఓటీ సౌకర్యం కల్పించాలని హెచ్ఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో గోలేటి సీహెచ్‌పీ డీవైజీఎం భీంరావు జాడెకు హెచ్ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ పత్యం రాజాబాబు వినతిపత్రం అందజేశారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి సీహెచ్‌పీలో పనిచేస్తున్న కార్మికులకు షిఫ్టు చివరలో రేకు వస్తే అన్ని ఏరియాల్లో కార్మికులకు ఇస్తున్నట్టు గోలేటి సీహెచ్‌పీలో కూడా కార్మికులకు రెండు గంటల ఓటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీబీజీకేయస్ నాయకులు మైన్, సేఫ్టీ కమిటీలో కార్మికుల సమస్యల పరిష్కారానికి మాట్లాడి ఒప్పించాలి కానీ ప్రే మాస్కర్‌కు ఆశపడి కార్మికుల సమస్యలపై నోరుమెదపడం లేదని తెలిపారు. చేతకానీ టీబీజీకేయస్ నాయకత్వం వల్ల కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. గోలేటి సీహెచ్‌పీలో పనిచేస్తున్న కార్మికులకు ఇన్సెంటివ్, అదనపు పనికి ఓటీ ఇవ్వాలని హెచ్ఎంఎస్ యూనియన్ తరపున యాజమాన్యాన్ని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణస్వామి, షిఫ్టు ఇన్‌చార్జి ఎస్ కుమార్, కల్లూరి రాజు, యాకారి శంకర్, ఎం వెంకటేశం, కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి : జీఎం

నవతెలంగాణ-నస్పూర్



నస్పూర్‌లో...

ప్రతి ఒక్కరూ స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఏరియా జీఎం సంజీవరెడ్డి హాజరై మాట్లాడుతూ స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని సింగరేణి వ్యాప్తంగా జూన్ 16 నుండి జూన్ 30 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులందరు ప్రతిజ్ఞ చేయడం సంతోషకరమని, జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న స్వచ్ఛ భారతదేశానికి మనమందరం కృషి చేయాలని కోరారు. కార్యాలయాలు, గనులలో పరిశుభ్రతను పాటిస్తూ సంవత్సరానికి 100 గంటలు వారానికి రెండు గంటలు స్వచ్ఛందంగా పరిశుభ్రత కోసం పని చేస్తామని ప్రతిజ్ఞ చేయడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, అధికారుల సంఘం నాయకులు ఏవీ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, డీజీఎం ఐఇడి చిరంజీవులు, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, పర్చేజ్ ఎస్ఈ చంద్రశేఖర్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్, లా మేనేజర్ శిరీషరెడ్డి, డీవైపీఎం ఎస్వి రాజేశ్వర్‌రావు, సీనియర్ పీఓ పి కాంతారావు, ప్రకాష్‌రావు, సీనియర్ ఐటి ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందమర్రి : ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా జీఎం మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా చేపట్టారన్నారు. జూన్ 16 నుండి జూన్ 30 వరకు స్వచ్ఛత పక్వాడా మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అందులో పచ్చదనం పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, గనులు, విభాగాలు, కార్యాలయాల ఆవరణలు శుభ్రంగా ఉంచుకోవాలని, విరివిగా మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించేలా ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యుల్లో చైతన్యం తీసుకువచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలని పేర్కొన్నారు. మొదటి రోజు మందమర్రి ఏరియాలోని గనులలో, డిపార్ట్మెంట్లలో స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్, సీఎంఓఏఐ సెక్రెటరీ ఫైడిశ్వర్, ఏజీఎం(ఈ అండ్‌ఎం) నాగరాజు, ఎన్విరాన్మెంట్ అధికారి ప్రభాకర్, డిజీఎం సివిల్ శ్రీనివాసులు, డివైపీఎం మైత్రేయ బంధు, జీఎం కార్యాలయ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మందమర్రిలో...

ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు వెంటనే చేపట్టాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

నవతెలంగాణ - కౌటాల



ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు వెంటనే చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇందూరావు, వైద్య శాంతికుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయం ముందు ఉపాధ్యాయులతో కలిసి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు అగమ్యగోచరంగా ఉందన్నారు. కోర్టు కేసు విషయంపై ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని, 8 ఏండ్లుగా ప్రమోషన్లు లేక, పర్యవేక్షణ లేక విద్యావ్యవస్థ కుంటుపడిపోతుందన్నారు. పాఠశాలల్లో ఎక్కువగా విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రమోషన్లు, బదిలీలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు వెళ్లే అవకాశం కల్పించాలన్నారు. స్వరాష్ట్రమంటూ పోరాటం చేసిన ఉపాధ్యాయులకు సొంత రాష్ట్రంలోనే సొంత జిల్లా అంటూ పోరాటం చేయడం సరైందికాదని ఆమె హెచ్చరించారు. పారిశుధ్య కార్మికులను ప్రతి పాఠశాలకు నియమించి ప్రతినెల ఒకటో తేదీన వారికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, జీపీఎఫ్ మెడికల్ బిల్లులను విడుదల చేసి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఉపాధ్యాయులు మరో పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఊషన్న, అనిత, పలు మండలాల బాధ్యులు ప్రశాంత్, పసల్, దుర్గయ్య, తిరుపతి, రాజలింగు, కృష్ణ పాల్గొన్నారు.

అనుమతుల్లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

అనుమతుల్లేని ఆర్అండ్ఆర్ ష్లే స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్లపల్లి కాలనీలో అనుమతి లేకుండా కొనసాగుతున్న ఆర్అండ్ఆర్ ష్లే స్కూల్ ఎదుట శుక్రవారం వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల సన్నిగౌడ్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష-కార్యదర్శులు బండి సత్యనారాయణ, ఈదునూరి అభినవ్ మాట్లాడుతూ మండలంలో పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అనుమతులు లేకుండా నడుస్తున్నా మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంఈఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా కొనసాగుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోకుంటే డిఈవో కార్యాలయం ముందు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లెవేణి రాకేష్, కుతూబ్, సిద్దు పాల్గొన్నారు.

మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

నవతెలంగాణ ఆసిఫాబాద్



మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అలాగే కనీస వేతనం రూ.32000 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనం తీసుకుంటూ ప్రజల ఆరోగ్యం కాపాడంలో కార్మికులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్మికులందరినీ ప్రభుత్వం తక్కువ వేతనాలు చెల్లిస్తూ శ్రమ దోపిడీ గురి చేస్తుందన్నారు. ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని అన్నారు. కార్మికుల ఈపీఎఫ్ పూర్తి వివరాలు తెలిపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికునికి గుర్తింపు కార్డు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి.దివాకర్, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్, నాయకులు హరీష్, గంగాధర్, మమత, సోనీ, ప్రేమలత, మల్లక్క పాల్గొన్నారు.

దేశంలో, రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



నవతెలంగాణ-జన్నారం

దేశంలో రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్ అన్నారు. శుక్రవారం టీపీసీసీ రాష్ట ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ జన్మదిన వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వేడుకల్లో మండల ప్రధాన కార్యదర్శి ఫసీఉల్లా, ఎంపీటీసీ దాముక కరుణాకర్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి హేమంత్ చారి, పట్టణ అధ్యక్షులు దుమల్ల రమేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఇందయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బీనవేని గంగన్న యాదవ్, వాసాల రాజేశం, గాబ్రియేల్, దేవయ్య, వంగల నర్సయ్య, బైరి తిరుపతి, పి మధు,కె. గంగన్న, లింగన్న, యూత్ కాంగ్రెస్ నాయకులు మంద రాజేష్, అబ్దుల్ ముజ్జు, దుమల్ల ప్రవీణ్, చింతల సతీష్, శ్రీనివాస్, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ ఉడుతల రాహుల్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుని మృతి

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్



మండలంలోని చింతగుడ కోయవాగు గ్రామానికి చెందిన తాజోద్దిన్(38) గురువారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. తాపీ మేస్త్రిగా పని చేసే తాజోద్దిన్ గ్రామంలో ఇనయత్ ఇంట్లో పనికి వెళ్లాడు. ఇంటి పైకప్పు కోసం రేకులు అమర్చుతుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే అక్కడివారు గమనించి కరెంట్ మెయిన్ ఆఫ్ చేసి తాజోద్దిన్‌ను హుటాహుటిన హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సాబీరా ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిర్పూర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

మున్సిపల్ సిబ్బందికి, ఉద్యోగులకు అవార్డులు

నవతెలంగాణ-నస్పూర్



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకల్లో భాగంగా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మున్సిపల్ సిబ్బందికి, ఉద్యోగులకు అవార్డులను అందజేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సిసిసి కార్నర్‌లో మానవహారం నిర్వహించారు. కార్నర్ నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సుమంగళి ఫంక్షన్ హాల్‌లో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు, అదనపు కలెక్టర్ రాహుల్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కమిషనర్ టి రమేష్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం తెలంగాణకు హరితహారం మహత్తర కార్యక్రమాన్ని సీఎం ప్రవేశపెట్టిన అంశంపై అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ హరితహారం ద్వారా రాష్ట్రంలో అడవులతో పాటు పచ్చదనం పెరిగిందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే హరితహార కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో విద్యార్థుల బాధ్యత కీలకమన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు హరితహారం కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అంది. నాగ మల్లయ్య, ముత్యంపల్లి హైస్కూల్ హెచ్ఎం రాథోడ్ రమేశ్, ఉపాధ్యాయులు గణేష్, వేణు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కరపత్రాల విడుదల

నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రియాంక గాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా టీపీసీసీ తలపెట్టిన రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో మండల యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. క్విజ్‌లో పాల్గొనాలనుకునేవారు 917661899899 నెంబర్‌కి మిస్డ్ కాల్ ఇచ్చి రిజిస్టర్ చేసుకోవాలని, రిజిస్టర్ చేసుకున్న వారికి హాల్ టికెట్ నెంబర్ కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జూన్ 18న ఉదయం 10గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు ఆన్లైన్ పరీక్ష ఉంటుందని, పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా లాప్‌టాప్, రెండవ బహుమతిగా స్మార్ట్‌ఫోన్, మూడవ బహుమతిగా ట్యాబ్, అలాగే ప్రతి అసెంబ్లీ పరిధిలో 40 కన్సోలేషన్ బహుమతులు అందిస్తారన్నారు. ప్రతి అసెంబ్లీలో ఒక మహిళకు ఎలక్ట్రిక్ స్కూటీ ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సిద్దం తిరుపతి, ఎంపిటిసి భీంరావ్, ఉప సర్పంచ్ కనుకుల రాకేష్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు గోలేటి స్వామి, నాయకులు కొత్త రమేష్, షకీర్, మహంకాళి, జాడి శివ, వెంకటేష్, చిలుకయ్య పాల్గొన్నారు.

డిజిటల్ బోధన ద్వారా గుణాత్మక విద్య :డీఈఓ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పాఠశాలలో డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడానికి సాధ్యమవుతుందని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా 37 ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐఎఫ్‌సిపై జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పిల ద్వారా డిజిటల్ బోధన జరపడం ద్వారా విద్యార్థులందరికీ గుణాత్మక విద్య అందడం సులభతరం అవుతుందన్నారు. ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో లక్ష రూపాయల ఖర్చుతో సమకూరుస్తున్నటువంటి డిజిటల్ టీవీల ద్వారా విద్యను అందిస్తూ విద్యార్థులకు విద్య బోధన చేయవలసిందిగా ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్లు సత్తయ్య జంబోజు, భరత్, శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ శ్రీనాథ్, ఐఎఫ్‌పి కోఆర్డినేటర్ శ్రీనివాస్, సాంసంగ్ కంపెనీ ప్రతినిధి సురేష్, శిక్షకులు పాల్గొన్నారు.

కుంటల జలపాతాన్ని సందర్శించిన ట్రైనీ ఎఫ్‌బీఓలు

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కుంటాల జలపాతాన్ని శుక్రవారం 33వ బ్యాచ్‌కు చెందిన ఎఫ్‌బీవోలు ఏసీడీ రామ్మోహన్‌తో కలిసి సందర్శించారు. వారికి సిరిచెల్మ రేంజ్ అధికారి వాహబ్ అహ్మద్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన రేంజ్ విశిష్టతలు, కుంటాల జలపాతం ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కుంటాల ఎఫ్ఎస్ఓలు వసంత్‌కుమార్, సచిన్, భైరుబాయి పాల్గొన్నారు.

స్వచ్ఛత పక్వాడ కార్యక్రమం ప్రారంభం

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయం ఆవరణలో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని శుక్రవారం ఏరియా జీఎం జి దేవేందర్ ప్రారంభించారు. ఈ నెల 30 వరకు కొనసాగే ప్రత్యేక కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మైన్స్, డిపార్టుమెంట్లను శుభ్రంగా ఉంచుకోవాలని, గతంలో మాదిరిగా ఈసారి కూడా బెల్లంపల్లి ఏరియాకు స్వచ్ఛతలో మొదటిస్థానం వచ్చేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలని జీఎం కోరారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఉద్యోగులు కార్యాలయాలను శుభ్రం చేశారు. సాయంత్రం అన్ని విభాగాల అధిపతులతో స్వచ్ఛత పక్వాడ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కెహెచ్ఎం గుప్తా, టీబీజీకేయస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు, ఏజీఎం తిరుమలరావు, పీఓ ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి కె చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, అన్ని విభాగాల అధిపతులు, జీఎం కార్యాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 17 జూన్ 2023

లాసెట్‌లో ఉత్తమ ప్రతిభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల విడుదలైన లాసెట్-2023 ఫలితాల్లో జిల్లా విద్యార్థిని తన ప్రతిభను కనబర్చింది. ఇచ్చోడ మండంలోని ఆడేగామ గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది, తెలంగాణ అడ్వొకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కళ్లెం ప్రవీణ్‌రెడ్డి కుమార్తె కళ్లెం వెన్నెలరెడ్డి రాష్ట్ర స్థాయిలో 165 ర్యాంకు సొంతం చేసుకుంది. మొత్తం 120 మార్కులకు గాను. 80 మార్కులతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానుండి రాష్ట్ర స్థాయి ర్యాంకు 165 సొంతం చేసుకొంది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందనలు తెలియజేశారు.

షీటీం సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

షీటీం సేవలను ఆడ పిల్లలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని షీటీమ్ ఏఎస్ఐ సునీత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సరస్వతినగర్ కాలనీలో జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు షీటీం సేవలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేసిన వెంటనే భయపడకుండా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ నేరాలు, 1930 నంబర్ బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, క్యూఆర్ కోడ్, ఫోక్సో యాక్ట్, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఇబ్బందులకు గురైన వెంటనే షీటీం నెంబర్ 8712659953 ఫోన్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం సిబ్బంది విజయ పాల్గొన్నారు.

రషీద్‌ను రిమాండ్‌కు తరలించాలి



నవతెలంగాణ-చింతలమానేపల్లి

దుర్మార్గాలకు పాల్పడిన డబ్బా గ్రామానికి చెందిన సర్పంచ్ కుమారుడు రషీద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పర్యటనలో భాగంగా మాట్లాడుతూ గిరిజన మహిళపై దాడి చేసినా ఇప్పటి వరకు నిందితునిపై కేసు నమోదు చేయలేదని, అధికార పార్టీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. పోలీసులు తీరు మార్చుకొని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర సలహాదారులు హర్షద్ హుస్సేన్, సిడాం గణపతి, దుర్గం శంకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పీచర సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు జరుగుతున్న దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుండి 1 గంటల వరకు పీచర, ధర్మారం, పార్పెల్లి పరిదిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అంబేద్కర్ భవన నిర్మాణనికి నిధులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, శుక్రవారం లక్ష్మణచాంద గ్రామ ప్రజలు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో అంబేద్కర్ భవనం నిర్మించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణానికి రూ. 25 లక్షల నిధులు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, మండల కన్వీనర్ కొరిపెల్లి కృష్ణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కె నరేష్ రెడ్డి ఉన్నారు.

విద్యాదినోత్సవంపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన

నవతెలంగాణ-కడెం

విద్యాదినోత్సవంపై ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం మండల నోడల్ ఆఫీసర్ డీఎల్ఎన్ చారి విద్య దినోత్సవం గురించి ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ విద్యా దినోత్సవం జూన్ 20వ తేదీన తెలంగాణ విద్యా దినోత్సవం జరుగుతుందని అన్నారు. పాఠశాలను అరటాకులు, కొబ్బరాకులు, రంగవల్లులతో అలంకరించాలని గ్రామ పరిధిలోని విద్యా కమిటీ చైర్మెన్, విద్యా కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ వార్డు మెంబర్లను ఎంపీటీసీ, జెడ్పీటీసీ గ్రామ పెద్దలను ఆహ్వానించి గ్రామంలో ర్యాలీగా వెళ్లి తల్లిదండ్రులను ఆహ్వానించి వీధి కూడలిలో విద్యార్థులచే పాటలు, నాటకాలు, డ్యాన్సులు చేయించి, జెండా ఎగురవేయాలి వాక్తలచే దశాబ్ది ఉత్సవాల గురించి ఉపన్యాసం ఇప్పించాలని అన్నారు. అలాగే పాఠశాల 10 సంవత్సరాలలో సాధించిన అభివృద్ధి గురించి తెలియజేయాలని అన్నారు. అనంతరం ఎల్ఎన్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కడెం మండల ప్రధానోపాధ్యాయులు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, ప్రేమ్‌దాస్ పాల్గొన్నారు.

తపాలా శాఖ మేళా

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోతపాలా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తపాల శాఖ మేళ నిర్వహించారు. కొత్తగా ప్రారంభించిన మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్ స్కీమ్ గురించి వివరిస్తూ మండల కేంద్రంలో మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటా తిరుగుతూ మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్, సుకన్య సమృద్ధి, ఆర్‌డి, ప్రమాద బీమా పథకాల వివరాలను ప్రజలకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెయిల్ ఓవర్సీర్స్ భరత్, బ్రాంచి పోస్ట్ మాస్టర్‌లు శ్రీనివాస్, మల్లేష్, వికాస్‌రెడ్డి, వంశీ, దీపక్, అంగన్వాడి ఉపాధ్యాయురాలు మంజుల గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీ యూనివర్సిటీ వద్ద ఏబీవీపీ నాయకుల ఆందోళన

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై శుక్రవారం ఏబీవీపీ నాయకులు యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద నిరసన తెలిపారు. యూనివర్సిటీలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ యూనివర్సిటీలో వరుసగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటూ ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుందని, తక్షణమే యూనివర్సిటీ వీసీ, డైరెక్టర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.కోటి అందించాలని డిమాండ్ చేశారు.

నచ్చన్‌ఎల్లాపూర్‌లో పర్యటించిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-కడెం

మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి పర్యటించారు. నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో వంట కొరకు నిర్మించిన గోబార్ గ్యాస్‌ని పరిశీలించారు, ప్రాథమిక పాఠశాల సందర్శించి, పిల్లలతో మాట్లాడారు, పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురుకుల పాఠశాలలో నిర్మించిన రైన్ వాటర్ హార్వెస్టింగ్‌ని పరిశీలించి, గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు, గ్రామంలో జరిగిన అభివద్ధిని పనులను పరిశీలించి, సర్పంచ్ బొడ్డు గంగన్నను అభినందించారు. గ్రామానికి నేషనల్ లెవెల్‌లో ఉత్తమ గ్రామంగా అవార్డు వచ్చేలా కృషి చేయాలని తన వంతు సహకారం అందిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చిన్నయ్య, ఎంపీడీఓ వెంకటేశర్లు, ఎంపీఓ ఉపేందర్, ఏపీఓ జయదేవ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్, టీఏలు కాంతారావు, గణేష్, సుభాష్, కార్యదర్శి రమాదేవి, ఎఫ్ఏ కమలాకర్, కారోబార్ మహేందర్, టీచర్ ప్రతాప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ రక్షణకు పోరాడుదాం

- అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్త జీపుజాతా
- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి



నవతెలంగాణ-నిర్మల్

ఐసీడీఎస్ రక్షణకై పోరాడుదామని, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్త జీపుజాత నిర్వహించడం జరుగుతుందని, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జీపుజాత శుక్రవారం నిర్మల్ చేరుకుంది. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బహిరంగ సభలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ నూతన విద్య విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. ఐసీడీఎస్ రక్షణ కోసం, అంగన్‌వాడీ ఉద్యోగులకు 45వ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల ప్రకారం కనీస వేతనం, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని అన్నారు. పెరిగిన ఇంటి అద్దెలను చెల్లించాలని, ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని అన్నారు. రాష్ట్ర కోశాధికారి సునీత మాట్లాడుతూ అంగన్‌వాడీలు గత 30 ఏండ్లుగా పనులు చేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించక పోవడం చాలా దారుణమని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు రూ.5లక్షలు, ఆయాకు రూ.3లక్షలు ఇవ్వాలని అన్నారు. జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, అంగన్‌వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ. రాజమణి, ఉపాధ్యక్షులు శైలజ, విజయ, జిల్లా కార్యదర్శి బి.లలిత, గంగామణి, వనజ, శశికళ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించేందుకే ప్రభుత్వ కొనుగోళ్లు

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రేకుల గంగాచరణ్



నవతెలంగాణ-కుభీర్

రైతులకు మద్దతు ధర కల్పించేందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రేకుల గంగాచరణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నలు కొనుగోలు కేంద్రాన్ని మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మెన్ మాట్లాడుతూ తెలంగాణ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకే ప్రభుత్వం ద్వారా కొనుగోళ్లు చేసి మద్దతు ధరను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. దీంతో క్వింటాల్‌కి రూ.2,970 మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందని అన్నారు. దీంతో మండలంలో ఉన్న ఆయా గ్రామాల రైతులు తమ తమ వ్యవసాయ క్షేత్రంలో పండించిన పంటలకు దళారులకు అమ్మి మోసపోకుండా ఉండేందుకే ముందుగానే సీఎం కేసీఆర్ రైతుల పరిస్థితి ఆలోచించి, రైతులు నష్ట పోకుండా ఉండేందుకు ప్రభుత్వం ద్వారా కొనుగోళ్లు చేపట్టడం జరుగుతుందని అన్నారు. దీంతో రైతులు ఈ విషయాన్ని గమనించి దళారులకు పంటలు అమ్మి మోసపోకుండా ఉండాలని ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. అదే విధంగా ముందుగా వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో టోకెన్స్ తీసుకొని వారు ఇచ్చిన సమయానికి పంటలను తీసుకువచ్చి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహియోద్దీన్, మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కందుర్ సంతోష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల పీరాజి, సూది రాజన్న, స్థానిక సర్పంచ్ మీరా విజయ్ కుమార్, సీఈఓ క్రాంతి కుమార్, సహకార సంఘం సిబ్బంది, మండల నాయకులు నగలింగం వివేక్ రైతులు వ్యాపార వేత్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతరావు



నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతరావు అన్నారు. శుక్రవారం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, జెడ్పీటీసీ చారులత రాథోడ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనేక మాయమాటలతో గద్దెనెక్కిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.410కి ఉన్న సిలిండర్ ప్రస్తుతం రూ.1200కు చేరిందని అన్నారు. కాంగ్రెస్ హాయంలో రేషన్ షాపుల్లో 9 రకాల వస్తువులు అందించడం జరిగిందని అన్నారు. అదే విధంగా దళితబంధు పేరుతో దళితులను మోసం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న అన్ని కట్టడాల్లో, అభివృద్ధి పనుల్లో కమీషన్‌లు తీసుకుంటూ రాష్ట్రాన్ని కమీషన్లు, అప్పుల తెలంగాణగా మార్చారని ఆరోపించారు. కేసీఆర్ ఏ ఒక్క రోజు ప్రజల్లో తిరగలేదని అన్నారు. సమస్యలపై అడిగితే అరెస్టుల పేరుతో భయభ్రాంతులకు గురి చేయడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణలో కేసీఆర్ పాలన నిజాం పాలనలాగా కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రజల సంక్షేమాన్ని కేసీఆర్ ప్రభుత్వం మరిచిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రభుత్వాలకు గద్దెదింపే సమయం ఆసన్నమైనందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మండల, గ్రామ కమిటీల ఎన్నుకోవడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా రాజీవ్ గాంధీ క్విజ్ పోటీలపై అవగాహన కల్పించారు. కమిటీల ఏర్పాట్లలలో భాగంగా రాష్ట్ర పర్యటన చేపట్టడం జరుగుతుందని జిల్లాలో మండలాల, డివిజన్లలో పర్యటిస్తూ పార్టీలో చేరికలు, కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతోందని అన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొజ్జు, నాయకులు ఉన్నారు.

టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికావు

- ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

తమ ప్రభుత్వంపై విమర్శలు చేసే నైతిక హక్కు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి లేదని మరోసారి తన గుర్చి అమర్యాదగా మాట్లాడితే సహించబోనని ఎమ్మెల్యే జోగు రామన్న శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల రేవంత్‌రెడ్డి తనను, తన ఇంటి పేరును ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు. బడుగు, బలహీన వర్గానికి చెందిన ఎమ్మెల్యేను కాబట్టే ఓర్వలేకే తనను అవమానించారని మండిపడ్డారు. మరోసారి ఇటువంటి వ్యాఖ్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గతంలో రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడుకు నౌకరుగా వ్యవహరించారన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం ఆయన ఒంటెద్దు పోకడలతో విర్రవీగుతున్నారని ఆరోపించారు. అభివృద్దే పరమావధిగా దూసుకెళ్తున్న కేసీఆర్ ప్రభుత్వం గద్దె దిగుతుందన్న రేవంత్ రెడ్డి మాటలకు స్పందించిన ఆయన ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తాను ఆత్మహత్య చేసుకుంటానని కామెంట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకపోతే రేవంత్‌రెడ్డి ఆత్మహత్య చేసుకుంటాడా? అని సవాల్ విసిరారు. ప్రభుత్వ ప్రయివేటు రంగాల్లో లక్షలాది ఉద్యోగాలను కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని స్పష్టం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఇక్కడి నాయకులు సంబరాలు నిర్వహించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తన ఇంటిపేరును వక్రీకరిస్తూ చేసిన వ్యాఖ్యలపై రేవంత్‌రెడ్డి తనకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా రైతుబంధు సమన్వయ కమిటీ అధ్యక్షులు రోకండ్ల రమేష్, వైస్ ఎంపీపీ, జంగు పటేల్, పట్టణ అధ్యక్షులు అజయ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సవరించాలి

నవతెలంగాణ - సిర్పూర్(టి)



ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో తప్పొప్పులు సవరించుకోవాలని, రాబోయే ఎలక్షన్ కోసం ఓటరు జాబితాలో ఎలాంటి తప్పొప్పులుండకుండా చూడాలని తహసీల్దార్ రియాజ్ అలీ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌ఓలతో ఓటరు జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బీఎల్ఓ ఇంటింటికెళ్లి కుటుంబసభ్యుల వివరాలు సేకరించి జాబితాలో ఏమైన తప్పొప్పులుంటే సవరించాలన్నారు. 18 సంవత్సరాల వయసు నిండిన వారిని ఓటు జాబితాలో చేర్పించాలని, అలాగే చనిపోయిన వారి వివరాలు తెలుసుకొని వారిని ఓటరు జాబితా నుండి తొలగించాలని తెలిపారు. ఎన్నికల సమయం వరకు ఓటరు జాబితాను సరిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మోబిన్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-బేల

విత్తన, పురుగుమందుల డీలర్స్ అందరూ విత్తన చట్టం ప్రకారం వ్యాపారం చేయాలని, రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఉండాలని, నకిలీ విత్తనాలు విక్రయించరాదని అధిక ధరలకు, కాలం చెల్లిన విత్తనాలు, పురుగుమందులను ఉంచరాదని బేల వ్యవసాయ అధికారి వెండి విశ్వామిత్ర, జైనథ్, బేల సీఐ కోల నరేష్ అన్నారు. శుక్రవారం బేల పోలీస్‌స్టేషన్‌లో వ్యవసాయ, పోలీసుల అధ్వర్యంలో విత్తన, పురుగు మందుల చట్టం పైనా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ, సీఐ మాట్లాడుతూ విత్తన, పురుగుమందుల చట్టం ప్రకారం వ్యాపారం చేయాలని, వ్యాపారస్తులు ప్రతి ఒక్క స్టాక్‌కు సంబంధించిన పీసీ పత్రాలను కల్గి ఉండాలని, ఎప్పటికప్పుడు స్టాక్ రికార్డ్ మెంటేనేషన్ చేసుకోవాలని తదితర విషయాల పైనా డీలర్స్‌లకు అవగాహన కల్పిస్తు, రైతులకు ఎవరైనా విత్తనాలను అధిక ధరలకు అమ్మిన, కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులు ఉంచిన వారి పైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కృష్ణ కుమార్, బేల డీలర్స్ అసోసియేషన్ సభ్యులు అనిల్ గుండావార్, నిలేష్, ప్రణయ్, రామన్న, శ్రీకాంత్, సుశాంత్, విశాల్, అశన్న, సంతోష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని బూత్కూర్ గ్రామంలో శుక్రవారం ఎంపీడీఓ భాస్కర్ రెడ్డి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు అత్యధిక ఉష్ణోగ్రతలు ఉన్నాయని తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. వారి వెంట ఏపిఓ రవిప్రసాద్, టీఏ వినోద్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

కులవృత్తుల వారికి ప్రభుత్వం అందజేస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా అందజేయాలని లంబాడాకుల పోరాట సమితి నిర్మల్ జిల్లా అధ్యక్షులు బాణావత్ గోవింద్ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీలో ఉన్న కొన్ని కులాల వారికి ఈ పథకాన్ని వర్తింప చేయడం వల్ల మిగతా కులవృత్తులు చేసుకొనే వారికి నష్టం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం బీసీ వారికి ప్రకటించి, మిగితా కులవృత్తులు చేసుకొనే వారికి అవకాశం కల్పించకపోవడం సరైంది కాదని అన్నారు. ఇది కేవలం ఇంకా కొన్ని నెలలు వచ్చే ఎన్నికల్లో లబ్ధి కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిందని విమర్శించారు. వివిధ ఆంక్షల వల్ల లబ్దిదారులు మీ సేవ కేంద్రాల చుట్టూ రెవెన్యూ ఆఫీసుల చుట్టూ ప్రదక్షణలు చేస్తూ ధృవీకరణ పత్రాలు తెచ్చుకోవడంలో అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. అధికారులు నిర్లక్ష్యం ధోరణి వహిస్తూ ధృవీకరణ పత్రాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీకి చెందిన వారికే కాకుండా అన్నీ కులాల వృత్తుల వారికి ఈ పథకాన్ని వర్తింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా ఈ పథకం గడువు ఒక నెల పొడిగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎలాంటి ఆంక్షలు లేకుండా ధృవీకరణ పత్రాలతో సంబంధం లేకుండా లక్ష సాయం లబ్దిదారులకు అందించాలని డిమాండ్ చేశారు.

మతిస్థిమితం కోల్పోయి బావిలో దూకి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్ రూరల్

మతిస్థిమితం కోల్పోయి బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బూరుగూడలో చోటుచేసుకుంది. ఎస్సై రమేష్ తెలిపిన వివరాలు ప్రకారం గ్రామంలోని అబ్బూరి పంచాక్షరి(45) కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయి ప్రతిరోజు ఇంట్లో గొడవకు దిగేవాడు. చాలాసార్లు ఆసుపత్రికి తీసుకెళ్లినప్పటికీ మతిస్థిమితం సరికాలేదు. శుక్రవారం ఉదయం మలవిసర్జన నిమిత్తం గ్రామ శివారులోకి వెళ్లి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు. కొడుకు అబ్బూరి కృపానిది ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదల

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదలైనట్టు డీఈఓ ప్రణీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ వెబ్ సైట్‌లో ఫలితాలు చూసుకోవాలని సూచించారు. మార్క్స్ మెమోలో ఏమైనా పొరపాట్లు ఉంటే సంబంధిత అధ్యయన కేంద్రాల ద్వారా జూలై 11లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్ కోసం ఈ నెల 24 నుంచి జూలై 4 వరకు మీసేవలో ఫీజు చెల్లించవచ్చని తెలియజేశారు.

ఆదిలాబాద్‌లో అట్టహాసంగా ఆదిపురుష్ సినిమా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన ఆదిపురుష్ సినిమా విడుదల ఆదిలాబాద్ జిల్లాలో అట్టహాసంగా సాగింది. ప్రభాస్ అభిమానులు సినిమా విడుదల సందర్భంగా సందడి చేశారు. జిల్లా కేంద్రాల్లోని నటరాజ్ థియేటర్‌లో, మహేశ్వరి థియేటర్లలో శుక్రవారం సినిమా విడుదల సందర్భంగా ప్రభాస్ అభిమానులు టపాసులు కాలుస్తూ, నృత్యాలు చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రబాస్ భారీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తూ తమ అభిమాన నటుడు నటించిన ఆది పురుష సినిమా విడుదలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే ఉదయం పట్టణంలో ద్విచక్రవాహనాల మీద బైక్ ర్యాలీ నిర్వహించారు. అటు మహిళ అభిమానులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు.

స్వదేశీ తయారీకి రిజిస్ట్రేషన్ పొందిన బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్

నవతెలంగాణ - ఆదిలాబాద్

భారతీయ వ్యవసాయ రసాయన పరిశ్రమలో ప్రధాన సంస్థలలో ఒకటైన బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమి టెడ్, సెక్షన్ 9 (3) ఎఫ్ఎస్ఐఎం కింద ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ 10శాతం ఫ్లస్ డైఫెనోకోనజోల్ 12.5 శాతం ఫ్లస్ సల్ఫర్ 3శాతం ఎస్.సీ ఉత్పత్తి స్వదేశీ తయారీకి రిజిస్ట్రేషన్ పొందినట్లు శుక్రవారం ప్రకటించింది. ఈసందర్భంగా బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ ఎం.డి.విమల్ కుమార్ మాట్లాడు తూ... ఈ రిజిస్ట్రేషన్ కోసం తమ కంపెనీ చాలా ఎదురుచూసిం దన్నారు. సంవత్సరాలుగా బీఏఎల్ ఒక రైతు- కేంద్రీకృత సంస్థగా పరిశ్రమలో తనకం టూ ఒక సముచిత స్థానాన్ని సృష్టించుకుందన్నారు. ఇది తమ పే టెంట్ ఉత్పత్తి అవుతుందని, ఎఫ్‌పై 23లో వృద్ధికి కారణమైన తమ పేటెంట్ పొంది న విప్లవాత్మక కాంబినేషన్ రాస్పెస్తో సహా తమ ఇతర ప్రత్యేక కలయిక ఉత్పత్తు ల మాదిరిగానే ఈ కొత్త పరిచయం కూడా భారతీయ వ్యవసాయ రంగంలో మార్పులను తెస్తుందన్నారు. పంట సంరక్షణలో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని తాము విశ్వసిస్తున్నామన్నారు. ఈ ఉత్పత్తు లన్నీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 30 శాతం వృద్ధి, 20శాతం ఈబీఐటీడీఏ మార్జిన్ లక్ష్యాన్ని కొనసాగించడంలో తమకు సహాయం చేస్తున్నాయన్నారు. అధిక ప్రయోజనాలను నిర్ధారించడానికి తాము ప్రతి సంవత్సరం ఈ ఉత్పత్తుల మార్కెట్ వాటాను పెంచుతూనే ఉంటామని విమల్ కుమార్ తెలిపారు.